

ఘాట్ రోడ్డులో పొగ మంచు

ప్రజాశక్తి-అనంతగిరి: అల్లూరి జిల్లా ప్రముఖ పర్యటక కేంద్రమైన అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డు కొండ గిరి శిఖరాలలో మంచు దుప్పట్ల అలుముకుంది. మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గిరి శిఖరాలపై బుధవారం పొగ మంచు తెర అలుముకొంది. ఘాట్ రోడ్డు శివలింగపురం, తేడా, కాశీపట్నం వంటి ప్రాంతాలలో బుధవారం మధ్యాహ్నం సమయం లో ఈ పొగ మంచు శిఖరాల పైన పాకుతూ పర్యాటకులు మదిని దోబూచు లాడింది. కుటుంబ సభ్యులతో సెల్ఫీలు దిగారు.



అనంతగిరి, టైడా ఘాట్ రోడ్డులో మంచు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

-జగనన్నకు చెబుదాంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ -158 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: స్పందనలో స్వీకరించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో జగనన్న కు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం స్పందనకు హాజరైన అధికారులు మధ్యాహ్నా నుండి క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఒ వి.అభిషేక్, ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి వి ఎస్ ప్రభాకర్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతి అధికారి పి.ఎస్.కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, ఈఈ కె.వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, ఎంపిడివో ఎస్ రమేష్, తహశీల్దార్ నర్సమ్మ తదితరుల పాల్గొన్నారు.

స్పందనకు 158 అర్జీలు

జగనన్నకు చెబుదాం స్పందనకు విశేష స్పందన లభించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుదవారం నిర్వహించిన స్పందనకు 158 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐ టి డి ఎ ,పి. ఓ వి. అభిషేక్ తో కలసి మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారులు నిర్మాణాలు, భూ సమస్యలు , డ్రైనేజీ నిర్మాణాలు, సిసి రోడ్లు,మట్టి రోడ్లు నిర్మాణాలు కోసం ఫిర్యాదులు అందాయి.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

దోడిపుట్టు పంచాయతి కుమ్మిపుట్టు జంక్షన్ నుండి బీడిచెంప గ్రామం వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని బీడిచెంప గ్రామస్తులు పాంగి దశరథి, పాంగి రాజు వినతి పత్రం సమర్పించారు.స్థానిక కరెంటు ఆఫీసు వెనుక కించాయిపుట్టు గ్రామానికి మట్టి రోడ్డు నిర్మించాలని పలువురు అర్జీ పత్రం అందజేశారు. పాత ముంచంగిపుట్టు లో సి సి రోడ్డు నిర్మించాలని, పాత ముంచంగిపుట్టులో ఇల్లు మంజురు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఏనుగురాయి పంచాయతి అలడమూల గ్రామానికి సి సి రోడ్డు, మురుగు చెరువు గ్రామానికి తారు రోడ్డు మంజూరైందని దాని నిర్మాణం పూర్తి సర్పంచ్ సిరగం నరసింగరావు వినతి పత్రం సమర్పించారు.



స్టేట్మెంట్ తీసుకుంటున్న ఆర్ఐ

నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం జారీపై

తూతూ మంత్రంగా విచారణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజనేతరుడుకు నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై ఆదివాసీ గిరిజన సంఘం పిర్యాదు మేరకు బుదవారం తూతూమంత్రంగా అధికారులు విచారణ జరిపారు. విచారణ అధికారిగా తహశీల్దార్ ఎ వేణుగోపాల్‌ను నియమించారు. తనకు ఏమి సంబంధం లేనట్లు ఆయన వ్యవహరించారు. పిర్యాదుదారులు ఎదుట విచారణ, స్టేట్మెంట్ తీసుకోవాల్సిన తహశీల్దార్ పట్టించుకోలేదు. పిర్యాదుదారులు లేకుండా ఆర్ఐ నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్న పిట్టల రాంబాబు నుండి స్టేట్మెంట్స్ తీసుకున్నారు. విచారణకు హాజరైన ఎస్టీ భగత్ కుల ధ్రువీకరణ పొందిన పిట్టల రాంబాబు ఎటువంటి ఆధారాలు లేకుండా హాజరయ్యారు. ఎస్టీ నకిలీ జారీ పై విఆర్ఓ ఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ, పిట్టల రాంబాబు ఇంటికి తాను వెళ్లగా స్టీ కుల చెందిన వారని వాలంటీర్ చెప్పారని తెలిపారు.

క్రిమినల్ కేసు పెట్టాలి:
ఆదివాసీ గిరిజన సంఘం

గిరిజనేతరుడుకు నకిలీ ఎస్టీ భగత కుల ధ్రువీకరణ పత్రం పొందిన పిట్టల రాంబాబు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, క్రిమినల్ కేసు పెట్టాలని నకిలీ ధ్రువపత్రం జారీ చేసిన రెవిన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 12న విచారణ చేసినప్పటికీ సరైన ఆధారాలు లేని కారణంగా విచారణ వాయిదా వేశారని బుధవారం కుడా సరైన ఆధారాలు తీసుకురాలేదన్నారు. దీనిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పిర్యాదుదారులు లేకుండా స్టేట్మెంట్ తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బాధ్యులైన పిట్టల రాంబాబు కు సరైనా ఆధారాలతో హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన తహశీల్దార్ నేటికి చర్యలు తీసుకోక్కపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ విషయంలో వాలంటర్ క్షేత్రస్థాయి నుండి రెవిన్యూ ,మండల తహశీల్దార్ వరకు ముఖ్య పాత్ర పోషించారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అరకువేలి మండలం పెదలబుడు పంచాయతీ కొండవీది, శరభగుడ, కంటబౌంసుగుడ, జడ్పీ కాలనీ, సి కాలనీ, పద్మ పురం పంచాయితీ సంతోష్ నగర్, ఎండపల్లి వలస టీచర్స్ కోలని పరిధిలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పలువురు పొందారని, తక్షణమే అధికారులు ధీనిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన హక్కులు, చట్టాలు కాపాడవలసిన అధికారులు కాలరాస్తున్నారని అన్నారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్న బాధ్యులు పై జారీ చేసిన రెవిన్యూ సిబ్బంది పై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ విచారణలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, జన్ని భగత్ రామ్ (పద్మాపురం ఉపసర్పంచ్) ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కిల్లో జగనాదం, కొర్రా మగ్గన్న,కిండంగి రామారావు, మాజీ ఎంపీటీసీ బి కోగేష్, కిల్లో సహదేవ్, పి రాము,ఎపిఎస్ జిల్లా కార్యదర్శి చట్టు మోహన్ , హ్యూమన్ రైట్స్ జిల్లా నాయకులు ఎం రమేష్ పాల్గొన్నారు.



అత్యాధునిక పరికరాలతో కల్వర్టులు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎఒబిలో ముమ్మర తనిఖీలు

- మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఈ నెల 21 నుండి 27 వరకు జరగనున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుతో పాటు ఇతర ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సీలేరు ప్రధాన కూడలి నుంచి వచ్చి పోయే వాహనాలను స్థానిక ఎస్సై రామకృష్ణ నిలిపివేసి తనిఖీలు చేపట్టారు. సిఆర్పిఎఫ్ పోలీసు బలగాలను మోహరించి ప్రధాన రహదారులు, కల్వర్టుల్లో అత్యాధునిక పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు మావోయిస్టులు ఒకపక్క సన్నాహాలు చేస్తుండగా, మరోపక్క పోలీసులు ముందస్తుగానే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఎఒబిలో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలని రంగంలో దింపి అణువణువునా గాలింపు చేస్తున్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రామకృష్ణ కోరారు.



స్ప్రేయర్లు, కిచెన్ గార్డెన్ విత్తనాలు అందజేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

కస్టమర్ హైరింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఎఎస్‌డిఎస్ సంస్థ వారు చింతూరు మండలం తులసిపాకల గ్రామంలో ఏర్పాటు చేసిన కస్టమర్ హైరింగ్ కేంద్రాన్ని చింతూరు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే బుధవారం ప్రారంభించారు. అనంతరం స్ప్రేయర్స్, వీడర్స్, కిచెన్ గార్డెన్ కోసం విత్తనాలు రైతులకు అందించారు. ఈ గ్రామంలో ఇరకం శ్రీరామ్ అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేసిన కూరగాయల ప్లాంటేషన్‌ను సందర్శించారు. ఈ విధానంలో చేసే పద్ధతిని రైతును అడిగి తెలుసుకున్నారు. కాటిల్ షెడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయానికి కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు నీటి సౌకర్యం కోసం చెరువుల మరమ్మతులు చేయాలని, వేసవిలో రుతుపవనాలు ముందుగా వేసే విత్తనాలు (పిఎండిఎస్) 21 రకాలు అవసరం ఉంటాయని చెప్పారు. రైతులు కోరిన విధంగా చెరువుకు ఎన్‌ఆర్‌ఈజిఎస్ ద్వారా మరమ్మతులు చేయిస్తానని, ఐటిడిఎ ద్వారా విత్తనాలను అందిస్తామని పిఒ తెలిపారు. ఎఎస్‌డిఎస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు మాట్లాడుతూ తమ సంస్థ 10 సంవత్సరాల నుండి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. చింతూరు, విఆర్.పురం మండలాల్లోని 10 గ్రామాల్లో పూర్తి స్థాయిలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి కావాల్సిన ఇన్‌పుట్స్ సంస్థ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైఎస్‌ఎస్, ఎఎస్‌డిఎస్ సంస్థల సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బైక్ యాత్రను జయప్రదం చేయాలి



అరకులోయలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై సిపిఎం చేపట్టిన బైక్ యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. బుదవారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో బైక్ యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు.స్టీల్ ప్లాంట్ ను బడా పెట్టుబడిదారు కంపెనీకి కట్టబెట్టాలని కేంద్ర ప్రయత్నం చేస్తోందని, దీనిపై కార్మికులు, ప్రజలు గత వెయ్యి రోజుల నుంచి పోరాడుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు.స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలన్నారు. బైక్ యాత్ర 25న అరకులోయకు చేరుతుందన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల నాయకులు కె.మగ్గన్న, జి బుజ్జిబాబు, టి.జోషి, సిహెచ్ .గురుమూర్తి పాల్గొన్నారు.

సంతలో కరపత్రాల పంపిణీ ...

పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని ఈ నెల 25, 26,తేదీల్లో జరగనున్న ఉక్కు రక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో జరిగిన వారపు సంతలో సిపిఎం శ్రేణులు కరపత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సిపిఎం చింతపల్లి మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి మాట్లాడుతూ, విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు.వెయ్యి రోజులకు పైగా పోరాడుతున్నా. కేంద్ర ప్రభుత్వం వైఖరిలో మార్పు రాలేదన్నారు. 29న కూర్మన్నపాలెం స్టీల్ దీక్ష శిబిరం వద్ద వేలాది మందితో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న నేతలు

23న పెదబయలులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 23న పెదబయలు ఎంపిడిఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పాడేరులో 22న శుక్రవారం స్పందన కార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు పెదబయలు మండలంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు. స్పందన కార్య క్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్ర స్థాయి సబ్బందితో సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. పాడేరు ఐటిడి ఏ లో శుక్రవారం స్పందన రద్దు చేయడం జరిగిందన్నారు. ఐటిడిఏ కార్యాలయాలనికి అర్జీదారులు రావద్దని సూచించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెసి శివ శ్రీనివాస్

22న పాడేరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం 10గంటల నుండి 10 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు.ఈ మెగా జాబ్ మేళా గోడ పత్రికని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, కె.అప్పలరాము జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆవిష్కరణ చేసారు. జిల్లాలోని 18 సంవత్సరముల నుండి 30 సంవత్సరములు మధ్య గల ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశంని వినియోగించుకోవాలని వారు కోరారు. బయో డేటా,ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం 10,000- నుండి 30,000 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. .మరిన్ని వివరములకు పోన్: 9491786463, 6304634447 నెంబర్లను సంప్రదించగలరు.

గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రంలో ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన మత్స్యగెడ్డలో మంగళవారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృదేహనికి ఒళ్ళంతా గాయాలై ఉన్నాయి. స్థానికుల అనుమానం ప్రకారం ఒడిస్సా కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. పెదబయలు పోలీసులు ఒడిస్సాకు చెందిన పాడువా బ్లాక్ కు చెందిన పోలీసులకు సమాచారం అందించారు.

23 వరకూ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-పాడేరు: వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 23 వ తేదీ పొడిగించామని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ఎంపిడిఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు చేయాలని సూచించారు.

వెలుగు యానిమేటర్ల సమస్యలపై ఎపిడి కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-రంపచోడవరం

వెలుగు యానిమేటర్స్ (విఒఎలు) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం రంపచోడవరం వెలుగు ఎపిడి కార్యాలయాన్ని ముట్టడించారు. రంపచోడవరం డివిజన్‌లోని 7 మండలాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన విఒఎలు సీఐటీయూ రంపచోడవరం జిల్లా కార్యాలయం నుండి ఎపిడి కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ వెలుగు యానిమేటర్స్ ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాలు కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, గ్రామ సమాఖ్యల మెర్జ్ ఆపాలని డిమాండ్ చేశారు. వెలుగు యానిమేటర్స్ మెర్జ్ చేయడం వల్ల వేలాది మంది ఉపాధి పోతుందన్నారు. యానిమేటర్స్ ఉపాధికి నష్టం లేకుండా ఎక్కువ సంఘాలున్న యానిమేటర్స్ నుండి తక్కువ సంఘాలున్న యానిమేటర్స్ సర్దుబాటు చెయ్యాలని, ఎటువంటి రాజకీయం జోక్యం ఉండకూడదని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 15 సంఘాలు లోపు ఉన్న వెలుగు యానిమేటర్స్‌కు వేతనాలు చెల్లించలేదని, వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. వయస్సు పైబడిన, అనారోగ్యంతో ఉన్నవారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి వెలుగు యానిమేటర్‌గా అవకాశం ఇవ్వాలని జెండర్, వయస్సు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. యానిమేటర్స్‌తో దురుసుగా, అసభ్యకరంగా మాట్లాడిన రంపచోడవరం మండలం వెలుగు ఎపిఎంపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రంపచోడవరం వెలుగు ఎపిడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కె.వీరబాబు, వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు చంద్రశేఖర్, బషీరా, జి.జగన్నాధం, ఈ.సత్యనారాయణ, మంగాయమ్మ, ఏడు మండలాల విఒఎలు పాల్గొన్నారు.



వెలుగు ఎపిడి కార్యాలయాన్ని ముట్టడించిన యానిమేటర్లు

బిఇడిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ


ప్రజాశక్తి-రంపచోడవరం

భద్రాచలం ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బిఇడి కళాశాలలో రెగ్యులర్ బిఇడి కోర్సులో (2 సంవత్సరాలు) ప్రవేశం నిమిత్తం షెడ్యూల్డ్ ప్రాంతం గిరిజన పట్టభద్రుల నుండి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. ప్రవేశ గడువు సెప్టెంబర్ 20తో ముగియనుండగా, ఈ గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన షెడ్యూల్డ్ ప్రాంతాలకు చెందిన గిరిజన పట్టభద్రులు అర్హులని, డిగ్రీ పాసై కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలని సూచించారు. సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్‌ని బట్టి ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నియమాల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరి వారికి సీట్లు కేటాయించబడ్డాయని తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ప్రోస్పెక్టస్, దరఖాస్తులు ఉచితంగా పొందుటకు రంపచోడవరం ఐటిడిఎ, ఉప సంచాలకుల కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వరకు పొందవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు పోస్ట్ ద్వారా పొందగోరు అభ్యర్థులు తమ సొంత చిరునామా గల కవర్ (రూ.10/- స్టాంపు తో) ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలం నుండి పొందవచ్చని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు నమూనా ప్రకారం పూర్తి చేసి తగు జత పత్రాలతో దరఖాస్తులు ఈ నెల 30 లోగా కళాశాలకు చేరాలని సూచించారు.

నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం

నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు మండలంలోని ముసురుమిల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల (స్పోర్ట్స్ స్కూల్)లో బుధవారం జరిగాయి. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని 11 మండలాల్లో ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న 600 మంది బాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. అండర్-14, అండర్ -17 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, బాల్ బాడ్మింటన్, త్రోబాల్, టెన్నీ కాయిట్, యోగా, అథ్లెటిక్స్ తదితర క్రీడలకు సంబంధించి ఎంపికలు జరిగాయి. 11 మండలాల నుండి వచ్చిన పీడీ, పీఈటీలు మొత్తం 30 మంది ఈ సెలెక్షన్స్ నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లా స్థాయి సెలెక్షన్స్‌లో పాల్గొనవలసి వుంటుంది. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎటిడబ్ల్యూఒ, ఎంఈఓ, ముసురుమిల్లి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, రంపచోడవరం జిహెచ్‌ఎస్ హెచ్‌ఎం, నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కంగల పోతురాజు, కె.బుచ్చన్న దొర, తదితరులు పాల్గొన్నారు



పెసర, మినుము విత్తనాలు అందజేస్తున్న రేఖపల్లి సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు తదితరులు

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో 90శాతం సబ్సిడీపై మినుము, పెసర విత్తనాలను రైతులకు స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపిటిసి బంధం విజయలక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ చేతులమీదుగా బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వీటిని అందిస్తుందని, ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విత్తన కుల్లు, తెగులు రాకుండా విత్తన శుద్ధి చేసే విధానాన్ని మండల వ్యవసాయ అధికారి చూపించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గూటాల శ్రీనివాసరావు, సోడి మల్లయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని రామవరంలో రైతులకు విత్తనాలను ఎంపీపీ కారం లక్ష్మి, ఆ పంచాయతీ సర్పంచ్ కారం బుచ్చమ్మ, జిపి అధికారులు పంపిణీ చేశారు.

ధారాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం ధారాలమ్మ అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ అధికారులు గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం చేపట్టారు. 45 రోజులకు గాను రూ.1,42,450 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవాలయ శాఖ అధికారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మాజీ మంత్రి లేఖలపై పిఒ స్పందన

- సమస్యల పరిష్కారానికి సిఫార్సు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం గిరిజన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు, మండల కేంద్రాల్లో వీధిలైట్లు ఏర్పాటు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పసుపులేటి బాలరాజు లేఖలపై ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. ఈ మేరకు ఆర్టీసీ డిఎం, ఏపీ ఈపీడీసీఎల్ డిఈకి వీటి ఏర్పాటు నిమిత్తం సిఫార్సు చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇటీవల కాలంలో అల్లూరి జిల్లా పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాజీ మంత్రి బాలరాజు స్పందిస్తూ వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్లూరి జిల్లా కలెక్టర్‌కు, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి పలు లేఖల ద్వారా వారి దృష్టికి తీసుకువచ్చారు. అల్లూరి జిల్లా ఏర్పడిన తర్వాత రవాణా సౌకర్యం లేక, పలు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులకు వివరిస్తూ జిల్లా కేంద్రం నుంచి కూనవరం చింతూరు పీలేరు అనంతగిరి కొయ్యూరు రంపచోడవరం తదితర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రాలలో వీధిలైట్లు పునరుద్ధరించాలని ఆయన పలు లేఖల్లో అధికారులకు వివరించారు. చింతపల్లి మండల కేంద్రంలో 100 మంది బీసీ విద్యార్థినీలు ఉంటున్న వసతి గృంలో రెండు గదులు మాత్రమే ఉన్నాయని, దీనిపై అధికారులు స్పందించి వసతి పెంపొందించాలని సూచించారు.

శ్రమదానంతో మట్టి రోడ్డు

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలో బొంగరం పంచాయతీ చిట్రకాయ పుట్టు గ్రామంలో రహదారి సౌకర్యం లేక గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చిట్ర కాయపుట్టు రోడ్డు పూర్తిగా పాడైంది. స్పందించిన స్థానిక ఎస్ఐ పులిమనోజ్ కుమార్ స్థానిక ప్రజలతో శ్రమధానం చేపించి మట్టి రోడ్డు వేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీపతి, గ్రామస్తులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న గిరిజనులు


బ్రిడ్జి నిర్మాణం చేపట్టరూ..

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో గిన్నెలకోట వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు పెదబయలు, జి.మాడుగుల, మద్దిగరువు వంటి ప్రధాన ప్రాంతాలకు వెళ్ళలేనంత నీరు ప్రవహిస్తుందని స్థానిక మాజీ సర్పంచ్ జి.రామన్న పడాల్ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకతో గిరిజనులు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. అనారోగ్యం వస్తే ఊరు దాటలేక గ్రామంలోనే ఉండి పోవాల్సి వస్తుందన్నారు.

వైసిపి మండల అధ్యక్షునిగా స్వామి ఎన్నిక



ప్రజాశక్తి -అనంతగిరి:వైసిపి మండల అధ్యక్షుడుగా వేగబోయిన స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే శెట్టి. పాల్గుణ మండల అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తరాలను జారీ చేశారని స్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికలలో గెలుపు లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీకి చెందిన సర్పంచ్ పాగి. అప్పారావు, మార్కెట్ డైరెక్టర్ కొర్రా. సూర్యనారాయణ, చిలకలగడ్డ ఎంపీటీసీ తడబారికి, మిత్తుల సర్పంచ్ మజ్జి .అప్పారావు తదితరులు అభినందించారు.



కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు

ఆహ్లాదకరంగా ప్రకృతి అందాలు

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం దారకొండ రైన్ గెజ్ ఘాట్ రోడ్లో మంచు అందాలు, ప్రకృతి సోయగాలు పర్యాటకు మైమరిపిస్తున్నాయి. లంబసింగి నుంచి సీలేరు వరకు దట్టమైన అటవీ ప్రాంతం, ఎత్తైన కొండలు, కోనలు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాలువారే జలపాతాలు, మరెన్నో సుందర దృశ్యాలు ఈ మార్గంలో ప్రయాణించే వారిని, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. మంచు మేఘాల అందాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. చింతపల్లి నుంచి జీకే వీధి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా కాఫీ తోటలు, మిరియాలు, లవంగి పాదులు చూపుర మనసులను హత్తుకుంటున్నాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో సీలేరు రిజర్వాయర్ నదీ జలాలు, ప్రకృతి అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ప్రస్తుతం చర్చలోకి వస్తున్న పీఠాధిపతులు, సాధువుల రాజ్యాంగ ముసాయిదాను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ మేధావి, సామాజిక విప్లవకారుడు బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ విమర్శించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో కూడా ఇంతటి అరాచకం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్ర మంత్రులు తమ బాధ్యతలను మరిచి జగన్మోహన్‌రెడ్డి భజన చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికలలో ఓటమి తప్పదనే విషయం స్పష్టంగా తెలియడంతో అక్రమంగా చంద్రబాబుపై కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. జైలులో పెట్టిన తర్వాత సాక్షాలు సేకరిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. మరోవైపు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎపి ఫైబర్, రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయంటూ మరికొన్ని కేసులను తవ్వే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం సాధించి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పి.వసంతరావు, బోడేపూడి దొరబాబు, దువ్వి పరమేశ్వరరావు, కెఎస్.ప్రసాద్, అనసూరి మధుసూదనరావు, గండి మోహన్, పి.గురునాధరావు, కోరాడ శ్రీనివాసరావు, సిహెచ్.శ్యామ్ పాల్గొన్నారు.

ఎయులో తాపీ ధర్మారావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఎయులో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు మాట్లాడారు. తాపీ ధర్మారావు జీవన ప్రస్థానాన్ని వివరించారు.

జిల్లాలో ఉపాధి హామీలో భాగంగా..

1.20 కోట్ల పని దినాల కల్పనే లక్ష్యం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లో భాగంగా కోటి 20 లక్షల పని దినాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి 22 మండలాల ఎంపిడిఓలు, ఉపాధిహామీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికి కోటి పనిదినాలు లక్ష్యాన్ని పూర్తి చేసారని, మరొక 20లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఆర్ఓ ఎఫ్ ఆర్ రైతులకు 150 రోజుల పని కల్పించాలని చెప్పారు. మిగిలిన రైతులకు వందరోజులు ఉపాధి పని కల్పించాలని పేర్కొన్నారు. టెక్నికల్ సహాయకులు, ఫీల్డు అసిస్టెంట్లు గ్రామంలో పర్యటించి ఆధార్ సీడింగ్ చేయని కూలీల వివరాలు సేకరించి ఉపాధి హామీ ఎపిఓకు అందజేసి, ఎపిఓ బ్యాంకు అధికారులతో మాట్లాడి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింకేజీ చేయాలని చెప్పారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద కాంట్రాక్టర్లకు ముందస్తు అడ్వాన్సులు చెల్లించ వద్దన్నారు. ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించాలని పేర్కొన్నారు. స్వచ్ఛ మిత్రాల జీతాలను చెల్లించడానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎంపిడిఓలను ఆదేశించారు. ఎంఇ ఓలు, ఎటిడబ్ల్యూఓలు సమన్వయంతో పని చేసి పాఠశాలకు రాని విద్యార్థుల వివరాలు సమర్పించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించాలని చెప్పారు. సచివాలయం సిబ్బంది అటెండెన్సు వివరాలు ఎంపిడి ఓలు సమర్పించాలని పేర్కొన్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు జారీ చేయడానికి లక్ష్యాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేసారు. ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందించడానికి ఆధార్ కార్డు తప్పని సరని చెప్పారు. ఆధార్ లేకపోవడంతో రైతు భరోసా అందలేదన్నారు. అధికారులు మండల సర్వసభ్య సమావేశాలకు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. హాజరు కాకపోతే ఎంపిడిఓలు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం డిబిటి మేనేజర్ నరేష్, 22 మండలాల ఎంపిడిఓలు, ఉపాధి హామీ ఎపిఓలు, ఎంఇఓలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-జి.మాడుగుల:స్థానిక రామాలయం వీధిలో మత్స్య మాడుగులమ్మ యూత్ ఆధ్వర్యంలో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లడ్డు వేలంపాట నిర్వహించారు. వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ విజయ కుమారి, కోటేశ్వరరావు మాస్టర్, నారాయణరాజు, రామకృష్ణంరాజు, గిరి, యూత్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో మంగళవారం రాత్రినుండి భారీ వర్షం కురిసింది విద్యుత్ అంతరాయం ఏర్పడింది గురువారం మధ్యాహ్నం జోరువనా కురుస్తున్నప్పటికి వినాయక చవితి భక్తులు నిమగ్నం భక్తులు పోటే తారు మత్యాగెడ్డ ఉదతంగా ప్రవహిస్తున్నప్పటికి పలు జాగ్రత్తలు తీసుకొని నిమగ్నం చేశారు

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కే.కోడపల్లి పంచాయతీ బంధవీధి గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెనేజీ పనులను బుధవారం స్థానిక సర్పంచ్ మాతే చిలకమ్మా ప్రారంభించారు. పంచాయతీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ యూత్ కన్వీనర్ మాతే వెంకటరమణ, వార్డు సభ్యులు పలాస బొంజు బాబు బాబు, తిరుపతిరావు, వాలంటీర్లు రాయుడు, వెంకట్ శోభన్, సింహాచలం, గ్రామస్తులు పాల్గొన్నారు



కారుణ్య నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ సర్వీసులో ఉండగా వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాల వారసులు తొమ్మిది మందికి కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఆయన కార్యాలయంలో జారీ చేసారు. 9 మందికి రెవెన్యూ శాఖలో ఉద్యోగులుగా నియమించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు..

ఘనంగా ఉక్కు రక్షణ యాత్ర ప్రారంభం

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ సభ
స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలంటే బిజెపిని ఓడించాల్సిందే :
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
మధురవాడ, ఆనందపురం, తగరపువలసల్లో యాత్రకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ బారి నుంచి రక్షించుకునే క్రమంలో సిపిఎం ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో తలపెట్టిన ఉక్కు రక్షణ బైకు యాత్ర బుధవారం విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ యాత్రను జెండా ఊపి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యావత్ ఆంధ్ర రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దిక్సూచిగా నిలిచిందని, దీన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని ఉద్ఘాటించారు. తొలుత ముఖ్య అతిథి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖను రాజధానిని చేస్తామన్న వైసిపి నేతల మాటలను ఉటంకిస్తూ ముందు పారిశ్రామిక రాజధానైన విశాఖను కాపాడండి అంటూ హితవు పలికారు. విశాఖను ఉన్నదున్నట్టు వుంచకుండా ఇక్కడి ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బిజెపి నాశనం చేస్తుంటే ఏమీ అనక శ్మశానంలా మారాక రాజధాని చేస్తారా ? అంటూ ప్రశ్నించారు. బిజెపిని ఓడించడం ద్వారానే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజా యాత్రగా ఉక్కు రక్షణ బైకు యాత్ర సాగనుందన్నారు. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో ఈ నెల 29 వరకూ 1150 కిలోమీటర్లు మేర ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఉక్కు ఉద్యమం ప్రభుత్వాల పునాదులను కదులుస్తుందన్నారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రాష్ట్రానికి అత్యంత కీలకమైన భారీ పరిశ్రమని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోనే రిజర్వేషన్ల అమలు సాధ్యమన్నారు. కరోనా సమయంలోనూ మెడికల్ ఆక్సిజన్ అందించి వేలాది మందిని కాపాడిన సంజీవనిగా స్టీల్‌ప్లాంట్ నిలిచిందని గుర్తుచేశారు. ఉక్కు రక్షణ బైకు యాత్ర ప్రభుత్వానికి ఓ హెచ్చరిక వంటిదన్నారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర బైక్ యాత్ర రెండోదశ ఉద్యమం అని అభివర్ణించారు. గంగవరం అదానీ పరం అయ్యాక కార్మికులకు ఎన్ని కష్టాలు వచ్చాయో అందరికీ తెలుసునని, స్టీల్‌ప్లాంట్‌కు ఆ పరిస్థితి రాకుండా అడ్డుకోవాలని అన్నారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రధాన పార్టీల ఎంపీలు ఢిల్లీలో ఎందుకు పోరాడడం లేదని ప్రశ్నించారు. సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కొండయ్య మాట్లాడుతూ బైక్ యాత్రను చేపట్టిన సిపిఎంను అభినందించారు. సభలో సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, బొట్టా ఈశ్వరమ్మ, డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, బి.జగన్, శ్రీనివాసరాజు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు రామస్వామి, వైటి.దాస్ పాల్గొన్నారు.



జెండా ఊపి ఉక్కు రక్షణ బైకు యాత్రను ప్రారంభిస్తున్న వి.శ్రీనివాసరావు

ఎక్కడక్కడ సాదర స్వాగతం

పిఎం.పాలెం : కొమ్మాది కూడలి వద్దకు చేరుకున్న ఉక్కు రక్షణ బైకు యాత్రకు సాదర స్వాగతం లభించింది. సిపిఎం మధురవాడ జోన్ కమిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ జరిగిన కార్యక్రమంలో యాత్రకు నాయకత్వం వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడారు. యాత్రకు స్వాగతం పలికిన వారిలో సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, నాయకులు పి.రాజ్ కుమార్, బి.భారతి, డి.కొండమ్మ, కె.సుజాత, జి.చిన్నారావు, టి.రమేష్, కె.రాము ఉన్నారు.

ఆనందపురం : యాత్రకు బోయపాలెం కూడలిలో సిపిఎం నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, సిఐటియు నేతలు స్వాగతం పలికారు. ఆనందపురం కూడలిలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ప్లైవుడ్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జాతరకు సంఘీభావం తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా నాయకులు, గంభీరం సమైక్య అపార్ట్‌మెంట్ నాయకులు విఆర్.నాయుడు, కృష్ణమూర్తి, ద్రాక్షాయిని, సత్యం నాయుడు, లక్ష్మి, ఐద్వా నాయకులు కె.నాగరాణి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు డి.రాము, ప్లైవుడ్ యూనియన్ నాయకులు డి.రమణ, రామారావు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానికంగా వివిధ రంగాల కార్మికులు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. వై జంక్షన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా జంక్షన్‌కు బైకు ర్యాలీ చేరుకుంది. అనంతరం జరిగిన సభలో లోకనాథం, జగ్గునాయుడు మాట్లాడుతూ దేశ కార్మిక వర్గ పోరాట చరిత్రలో ఉక్కు పరిరక్షణ ఉద్యమం చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు



ప్రారంభ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

చిన్నారి పట్ల అసభ్య ప్రవర్తనపై జైలు శిక్ష

ప్రజాశక్తి-లీగల్ : నాలుగో తరగతి చదువుతున్న చిన్నారి పట్ల అసభ్య ప్రవర్తన చేశారనే అభియోగం రుజువైనందున 56 ఏళ్ల వ్యక్తికి చిన్నపిల్లల పట్ల లైంగిక వేధింపుల కేసుల విచారణ జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది ఐదేళ్లు జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో చిన్నారి తరుపున వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి... గాజువాక సమీపంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో గుజ్జాల సూరయ్య (58) ఏలియాస్ రాజు అదే ప్రాంతానికి చెందిన నాలుగవ తరగతి చదువుతున్న చిన్నారిని 2022 ఏప్రిల్ 28వ తేదీన రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యకర ప్రవర్తన చేశాడు. దీనిపై చిన్నారి తల్లి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నేరాభియోగ పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి -ములగాడ : ఇంటర్న్ షిప్పులతో నైపుణ్యాలు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం డిగ్రీ నాలుగవ సెమిస్టర్ విద్యార్థినుల నైపుణ్య ఆధారిత స్వల్ప కాలిక ఇంటర్న్ షిప్పుల మూల్యాంకన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇంటర్న్‌షిప్‌ల వల్ల ప్రత్యక్షంగా విద్యార్థి జ్ఞానాన్ని సముపార్జిస్తాడని, ప్రత్యక్ష జ్ఞానం విషయ అవగాహనను పెంచుతుందని పేర్కొన్నారు. పెస్ట్ కంట్రోల్, డ్రోన్ టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, జావా, ఎక్సెల్ తదితర కంప్యూటర్ కోర్సులు ఈ ఇంటర్న్‌షిప్ కింద విద్యార్థినులు అభ్యసించారు. ప్రతి 20 మంది విద్యార్థినులకు ఒక అధ్యాపకురాలు మెంటార్‌గా వ్యవహరించి మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వై.అనసూయాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫాల్స్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ ఫాల్స్ ప్రివెన్షన్ వారోత్సవాల్లో భాగంగా ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాలలోని జిఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణంలో వృద్ధుల కోసం ఫాల్స్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రాన్ని అరబిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్ విఠల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇంటి వద్ద తూళి పడిపోవడం, దెబ్బలు తగలడం, కంటి చూపు మందగించడం తరచూ జరుగుతుంటాయని, ఇటువంటి వారికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయన్నారు. ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పతంగే మాట్లాడుతూ, వృద్ధులు పట్టుకోవడానికి కడ్డీలు, రెయిలింగ్ ఏర్పాటు, స్నానాల గదిలో కుర్చీ ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారు పడిపోవడాన్ని నివారించవచ్చని తెలిపారు. ఇటువంటి సదుపాయాలు ఫాల్స్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం వృద్ధులు పడిపోవడానికి కారణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

24లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : ఈ క్రాప్ నమోదును ఈ నెల 24వ తేదీలోపు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.అప్పలస్వామి సూచించారు. మండలంలోని గొట్టిపల్లి, కుసులవాడ రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు రాజేశ్వరి, సీత ఈ క్రాప్ ఎంత వరకు నమోదు చేశారో పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంట పొలాలను అప్పలస్వామి పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. బోని గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎడిఎ బి.విజయప్రసాద్ సందర్శించి ఈ క్రాప్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంటపొలాన్ని పరిశీలించారు.

మెరుగైన సేవలు అందిద్దాం : ఇఒ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం ఇఒగా బాధ్యతలు చేపట్టిన సింగాల శ్రీనివాసమూర్తి బుధవారం తన కార్యాలయంలో దేవస్థానంలో పనిచేస్తున్న విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ సమిష్టి కృషితో ఆలయాన్ని అభివద్ధి చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి మన్ననలు పొందాలని చెప్పారు. ముఖ్యంగా పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బంది విధానాలపై ఆరా తీశారు. ఆర్జిత సేవలు వివరాలు తెలియజేసే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, తిరుపతి తరహాలో వాహనాలను టోల్‌గేట్ వద్ద చెకింగ్ చేసి వాహనదారులకు సూచనలు చేసే బోర్డును ఏర్పాటుచేయాలని సూచించారు. భైరవ స్వామి, వెంకటేశ్వర స్వామి, మాధవధార ఆలయాలు, పైడితల్లి అమ్మవారి ఆలయం విశిష్టతను తెలిపే సైన్ బోర్డు ఏర్పాటుచేయాలన్నారు.



చింతూరులో దీక్ష చేపట్టిన నాయకులు

కొనసాగిన టిడిపి నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టిడిపి రంపచోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో టిడిపి క్యాంపు కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, గురుకు శేష్ కుమార్, పాము అర్జున్, పోడియం శ్రీనుబాబు, మట్ట మెహర్ బాబా గౌడ్, దూడా సువర్ణ కుమార్, గొర్లె సునీత, అడబాల బాపిరాజు, కనిగిరి రాంబాబు, దూడ ప్రణీత్, వై నిరంజన్ దేవి, షేక్ సుభాని, మారేడుమిల్లి మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు మండల కేంద్రంలో చేపట్టిన టిడిపి నిరాహార దీక్షలు 9వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో విఆర్.పురం జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, టిడిపి నాయకులు పి.రమేష్, ఇళ్ల చిన్నారెడ్డి, ఎటపాక మండల కార్యకర్తలు కానుమూరి బుల్లయ్య, మాచినేని రాజేష్, నలజాల మధు, కుర్రం చిన్న ముత్తయ్య, మల్లెల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు మీడియం రమణమ్మ పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి త్వరలో వెబ్‌సైట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్వరలో తెలుగు భాషాభివృద్ధికి వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు తెలిపారు. తెలుగు సాహిత్యానికి ఉత్తరాంధ్ర పుట్టినిల్లువంటిదని, ఇక్కడ నుంచి ఎంతో మంది కవులు, పండితులు, భాషాభిమానులు తెలుగు అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. బుధవారం ఉదయం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో కవులు, పండితులు భాషాభిమానులతో ఉత్తరాంధ్ర తెలుగు సాహిత్య సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు అధికార భాషకు ఇప్పటి వరకూ ఎటువంటి వెబ్‌సైటూ లేదని, దానిని రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. పత్రికా ప్రతినిధులు రాజకీయాలను అతీతంగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో తిరుపతిలో ఆత్యాధ్మిక భాషోత్సవాలు, పల్నాడులో దళిత సాహిత్య ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కోర్టు తీర్పులు తెలుగులో ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాపీ ధర్మారావు, గురజాడ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురజాడ నుంచి వంగపండు వరకూ అనేక మంది భాషాభిమానులు, కవులు, పండితులు తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. జానపద కథా సాహిత్యం గురించి సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. తెలుగు భాషకు సేవ చేస్తున్న వారిని సత్కరిస్తున్నామన్నారు. చిన్నయ్యసూరి విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహాకవి గురజాడ వెంకట అప్పారావు 161వ జయంతిని పురస్కరించుకుని సాహితీ స్రవంతి ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ సహకారంతో పలు విద్యాలయాలలో దేశభక్తి, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కంచరపాలెం ప్రాంతంలోగల ప్రభుత్వ మెకానికల్ ఇంజినీరింగ్ కళాశాలలో దేశభక్తి గీతాలు, ఉపన్యాస పోటీలు జరిగాయి. గవర్నమెంట్ ఐటిఐలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫ్రాన్సిస్, పి.రామారావు, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ కెవి.రమణ, ఐటిఐ ఆఫీసర్ జయలక్ష్మి, ఉమాదేవి, జ్యోతి, రామాంజనేయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కార్మిక ఉపాధ్యాయులు పిల్ల అర్జునుడు, సాహితీవేత్తలు కెబిఎస్.మూర్తి, ఆంటోనీ, పి.ఉమ, వెంకట అప్పారావు పాల్గొన్నారు.